

ప్రజా న్యూస్
నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 167,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,మంగళవారం , తేదీ : 20-10-2026

స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాల మోహరింపుపై వైసీపీకి ఎదురుదెబ్బ..



సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్

ఏపీలో పరిస్థితులు పశ్చిమబెంగాల్‌లా లేవని వాదించిన ప్రభుత్వం

రాష్ట్ర పోలీసులతోనే ఎన్నికల భద్రత

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతల కోసం కేంద్ర పారామిలిటరీ బలగాలను మోహరించాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌కు హైకోర్టులో మరోసారి చుక్కెదురైంది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ వైసీపీ వేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ ఈరోజు కొట్టివేసింది. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడానికి కేంద్ర బలగాలు అవసరమని... రాష్ట్ర పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మిగతా..2లో

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక



నవంబర్ చివరికల్లా కాఫర్‌డ్యామ్ నిర్మించాలని కవిత డిమాండ్

లేదంటే పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరిక

మేడిగడ్డను చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచన

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈరోజు కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నవంబర్ నెలాఖరు నాటికి ప్రాణహిత నీటిని మళ్లించేందుకు వెంటనే కాఫర్‌డ్యామ్‌ను నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయని పక్షంలో కన్నెపల్లి పంప్‌హౌస్ వద్దే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కరవు పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. మేడిగడ్డను ఒక భూతంగా చూపి రైతులను నష్టపరచవద్దని ప్రభుత్వానికి సూచించారు. మిగతా..2లో

50 డిగ్రీలకు చేరనున్న ఎండలు గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన



- సూపర్ ఎల్‌నినోతో ఎండలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తుమ్మల వ్యాఖ్య
- వర్షాలు తగ్గితే భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం
- గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశం
- భద్రాద్రి జిల్లా అమ్మగారిపల్లి వద్ద ఆనకట్టను మంత్రి పరిశీలన

హైదరాబాద్: తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భజలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని

కరవు, ఎల్ నినో ఎఫెక్ట్.. రంగంలోకి దిగిన టీజీ ప్రభుత్వం,

ఆరుగురు మంత్రులతో కమిటీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కమిటీ చైర్మన్ బాధ్యతలు
- కమిటీలో మొత్తం ఆరుగురు మంత్రులకు చోటు
- కరవు పరిస్థితులను పర్యవేక్షించి ప్రభుత్వానికి సిఫారసులు చేయనున్న కమిటీ



హైదరాబాద్: రాష్ట్రంలో నెలకొన్న కరవు, ఎల్ నినో పరిస్థితులను సమీక్షించి, నివారణ చర్యలు చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆరుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా వ్యవహరించనుండగా, ప్రణాళికా శాఖ కార్యదర్శి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా కరవు పరిస్థితులను ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుంది. సంబంధిత శాఖలకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు, తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేస్తుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలకు ప్రాధాన్యత ఇవ్వనుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేస్తుంది. నైరుతి రుతుపవనాల సమయంలో రాష్ట్రంలో 17 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో అనేక మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్న విషయం తెలిసిందే.

భూ వివాదాల శాశ్వత పరిష్కారమే

ప్రభుత్వ లక్ష్యం



- రాష్ట్రంలో భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.
- సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

ఓటర్ల జాబితాతో బీజేపీ కుట్ర

అఖిలేశ్ యాదవ్



- దొంగ ఓట్లను చేర్పిస్తూ, ప్రతిపక్షాల ఓట్లను తొలగిస్తున్నారని అఖిలేశ్ విమర్శ
- పోలింగ్ బూత్‌ల వద్ద కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తుందని వ్యాఖ్య

ఢిల్లి : సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు

గందరగోళాన్ని ఎన్నికల

సంఘమే పరిష్కరించాలి

- ఎస్ఐఆర్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ మండిపడింది.
- ఢిల్లీలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి ఓట్లను అక్రమంగా తొలగించారని విమర్శించింది.



ఢిల్లి : దేశ రాజధాని ఢిల్లీలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా నుంచి ఓట్లను అక్రమంగా తొలగించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ గందరగోళాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని, ఓటర్ల కోసం శిబిరాలు నిర్వహిస్తున్న పౌర సమాజానిది (సివిల్ సొసైటీ) కాదని విమర్శించింది. ఢిల్లీలోని రెండు పోలింగ్ బూత్‌లలో దాదాపు 100 మంది ఓటర్లను గైర్హాజరు, బదిలీ, మరణించడం, మిగతా..2లో

ఈ వారం దక్షిణాదిలో దంచికొట్టనున్న వర్షాలు

ఏపీ, తెలంగాణలో ఎలా ఉంటుందంటే?

- దేశంలో అన్ని ప్రాంతాల వాతావరణ పరిస్థితులను ఐఎండీ అంచనా వేసింది.
- ఉత్తర, మధ్య భారతదేశంలో ఈ వారం వాతావరణం పొడిగా ఉంటుందని పేర్కొంది.
- దక్షిణాది రాష్ట్రాల్లో వర్షం పడుతుందని తెలిపింది.



ఢిల్లి : బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ఆవర్తనం, అరేబియా మహా సముద్రంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావం కారణంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఈ వారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. అక్టోబర్ 24 వరకు కేరళ, మాహే, లక్షద్వీప్, దక్షిణ కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్ ప్రాంతాలలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలో కూడా అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని తెలిపింది. అలాగే ఆ సమయంలో గంటకు 30-50 కిలోమీటర్ల వేగంతో మిగతా..2లో

22,800కు పైగా నామినేషన్లు ప్రజాస్వామ్య ఎన్నికలకు ఇవే నిదర్శనం




- ఏపీలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయనటానికి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 22,800కు పైగా నామినేషన్లు దాఖలవడమే నిదర్శనమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు.

అమరాతి : ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయనడానికి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 22,800కు పైగా నామినేషన్లు దాఖలు కావడమే నిదర్శనమని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. అన్ని పార్టీల నుంచి, అన్ని వర్గాల నుంచి, రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం నుంచి అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచేందుకు ముందుకొచ్చారని తెలిపారు. ఒక్క ఓటు కూడా పడకముందే ఎన్నికలపై ఆరోపణలు చేసేవారు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో గెలుపోటములు నిర్ణయించేది మీడియా సమావేశాలు కాదని, ప్రజాక్షేత్రమేనని జగన్ కు కౌంటర్ ఇచ్చారు. ప్రజల వద్దకు వెళ్లాలని, అంతిమంగా ప్రజలే తీర్పు ఇస్తారని లోకేశ్ వెల్లడించారు.

స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ
- అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు
- విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు
- గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి



అమరావతి: సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. మిగతా..2లో

రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి.. నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి



- తిరుపతి జిల్లాలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటన
- వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదుకు పవన్ ఆదేశం
- నష్టాన్ని నిందితుల నుంచే వసూలు చేయాలని అధికారులకు సూచన
- ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం క్షమించరాని నేరమన్న డిప్యూటీ సీఎం
- 'పల్లె పండుగ 3.0' కింద వారం క్రితమే రోడ్డు నిర్మాణం

మొదటి పేజి తరువాయి

స్థానిక ఎన్నికల్లో కేంద్ర బలగాల మోహరింపుపై వైసీపీకి ఎదురుదెబ్బ.. పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన సింగిల్ జడ్జి, అక్టోబర్ 16న దానిని కొట్టివేశారు. ఈ తీర్పును సవాలు చేస్తూ వైసీపీ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. విచారణ సందర్భంగా, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోని పరిస్థితులతో ఏపీని పోల్చలేమని, ఇక్కడ పారామిలిటరీ బలగాల అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి కేంద్ర బలగాలను మోహరించేంత తీవ్రంగా లేదని అభిప్రాయపడింది. సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ డివిజన్ బెంచ్ కూడా అప్పీల్‌ను తోసిపుచ్చడంతో, స్థానిక ఎన్నికల భద్రత బాధ్యతలను రాష్ట్ర పోలీసులే నిర్వర్తించనున్నారు. దీంతో ఈ అంశంపై వైసీపీ చేసిన న్యాయపోరాటానికి నిరాశే ఎదురైంది.

భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

హైదరాబాద్, అక్టోబర్19: రాష్ట్రంలో భూ వివాదాల శాశ్వత పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో భూ భారతి, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ పునర్నిర్మాణంతోపాటు సేవల్లో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. 34 నెలల్లో 12,40,366 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసినట్లు వివరించారు. భూ భారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 5,68,858 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు రీ - సర్వేతో పరిష్కారమని పేర్కొన్నారు. సాగుదారులను గుర్తించి చట్టబద్ధమైన భూ హక్కుల కల్పన చేస్తున్నామని అన్నారు. నారాయణ పురంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూహక్కులు కల్పించామని సోదాహరణంగా వివరించారు. సూర్యాపేట జిల్లాలోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు అందించామని తెలిపారు. పాస్ పుస్తకాలతో రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా సహా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో రీ-సర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. భూ హక్కుల కోసం ఎదురుచూస్తున్న రైతులకు న్యాయం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

ఓటర్ల జాబితాతో బీజేపీ కుట్ర: అఖిలేశ్ యాదవ్

బీజేపీ కుట్రపూరితంగా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తోందని, దొంగ ఓట్లను చేర్పించడంతో పాటు ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తోందని ఆయన విమర్శించారు. లక్నోలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద పార్టీ కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. "మోసం, నిజాయతీ లేకపోవడాన్నే బీజేపీ తన బలంగా భావిస్తుంది. అందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతోంది" అని అఖిలేశ్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిన తర్వాత అఖిలేశ్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవలే వేల కోట్లు ఖర్చుపెట్టి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తి చేసిన తర్వాత, మళ్లీ ఇప్పుడు అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం బీజేపీకి అనుకూలంగా జాబితాను మార్చేందుకేనని ఆయన ఆరోపించారు.

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత.. ప్రభుత్వానికి హెచ్చరిక

తమ పార్టీ కేవలం విమర్శించడానికే పరిమితం కాలేదని, ప్రభుత్వానికి పరిష్కార మార్గాలు కూడా సూచిస్తోందని తెలిపారు. టీవీల్లో కనిపించడం కోసం కాకుండా, ప్రజల సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలనే ఉద్దేశంతోనే తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ సూచనలను సీరియస్‌గా తీసుకుని రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

భారత్ ఫ్రాన్స్ కాదు- బంగ్లాదేశ్ అంతకన్నా కాదు
మా డిమాండ్ స్వేచ్ఛాయుత ఎన్నికలే: శశి థరూర్

పాలన మార్పు కుట్ర ఆరోపణలను కాంగ్రెస్ ఖండించింది. నిరసనలు, అల్లర్ల మధ్య తేడాను గుర్తించాలన్న కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు



భారత్‌లో పాలన మార్పు కోసం కుట్ర జరుగుతోందన్న ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. బంగ్లాదేశ్, ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న పరిణామాలతో భారత్‌లోని నిరసనలను పోల్చడం సరికాదని స్పష్టం చేసింది. దేశంలో ప్రతిపక్షాలు శాంతియుత నిరసనలనే విశ్వసిస్తాయని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ వెల్లడించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడంపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. మరోవైపు, భారత్‌లోనూ ఫ్రాన్స్, బంగ్లాదేశ్ తరహా పరిణామాలకు కుట్ర జరిగిందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించడంపై ఈ విధంగా స్పందించారు. భారత్‌లో జరుగుతున్న నిరసనలను ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లోని పరిణామాలతో పోల్చడాన్ని శశి థరూర్ తప్పుబట్టారు. భారత్ ఆ రెండు దేశాల్లాంటిది కాదని స్పష్టం చేశారు. ఫ్రాన్స్‌లో జరిగిన హింసాత్మక ఘటనలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని తెలిపారు. బస్సులు, పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టడం వంటి చర్యలకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వదని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు శాంతియుత నిరసనలకే ప్రాధాన్యం ఇస్తాయని చెప్పారు. తాను కూడా అటువంటి నిరసనల్లోనే పాల్గొన్నానని, ప్రజాస్వామ్యబద్ధంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడమే ప్రతిపక్షాల ఉద్దేశమని వివరించారు. హింసకు పాల్పడటం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం తమ విధానం కాదని స్పష్టం చేశారు.

'ఎన్నికల్లో పారదర్శకతే లక్ష్యం'

భారత్‌లో ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయన్న ఆరోపణలను థరూర్ తోసిపుచ్చారు. 'రెజీమ్ ఛేంజ్' అనే పదాన్ని వక్రీకరించి రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని వ్యాఖ్యానించారు. తమ పోరాటం ప్రభుత్వాన్ని అక్రమంగా తొలగించడం కోసం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడటమే లక్ష్యమని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించడం అందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయని తెలిపారు. ఈ ప్రక్రియను సమీక్షించి, అన్యాయంగా తొలగించిన పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఓటర్ల జాబితాల తయారీలో పారదర్శకత తప్పనిసరి అని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది. ఈ అంశాన్ని రాజ్యాంగపరమైన సమస్యగా చూడాలని థరూర్ పేర్కొన్నారు. దీనిని ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నంగా చిత్రీకరించడం సరికాదని స్పష్టం చేశారు.

భారత్-యూరప్ పోలిక సరికాదు: పవన్ ఖేడా

కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు పవన్ ఖేడా కూడా భారత్‌లోని నిరసనలను యూరప్‌లో జరిగిన ఆందోళనలతో పోల్చడాన్ని తప్పుబట్టారు. భారత్, యూరప్‌లలోని పరిస్థితులను ఒకే గాటన కట్టలేమని వ్యాఖ్యానించారు. యూరప్‌లోని నిరసనలను ముస్లింలకు సంబంధించిన సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ముస్లింలను హింసాత్మకులుగా, తీవ్రవాదులుగా, అనాగరికులుగా చూపించే కథనాలను ప్రోత్సహించడం ప్రమాదకరమని ఖేరా పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారం ద్వారా భారత్‌లోనూ ముస్లింలను లక్ష్యంగా చేసుకునే వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. భారత్‌లో గతంలో జరిగిన కొన్ని నిరసనల సందర్భంగా మతపరమైన ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. సంఘ్ పరివార్‌కు చెందిన కొందరు వ్యక్తులు ముస్లింల వేషధారణలో కనిపిస్తూ అల్లర్లు రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో హింసాత్మక ఘటనలు, ఫ్రాన్స్‌లో అల్లర్లు, విధ్వంసం, దోపిడీ చోటుచేసుకున్న తరహాలోనే భారత్‌లోనూ కుట్రకు ప్రయత్నాలు జరిగాయని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. భారత్‌లో యువతను రెచ్చగొట్టి వీధుల్లో హింసను ప్రేరేపించేందుకు దేశ వ్యతిరేక శక్తులు, కొందరు రాజకీయ నాయకులు కలిసి ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. అయితే, భారత్‌లో ప్రభుత్వ మార్పు ఎన్నికల ద్వారానే సాధ్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియకు విరుద్ధంగా ఇతర మార్గాల్లో అధికార మార్పిడికి ప్రయత్నించడం సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. జార్జ్ సోరోస్ పేరును ప్రస్తావిస్తూ కూడా ఆయన విమర్శలు చేశారు.

రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి.. నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి

మొదటి పేజి తరువాయి



అమరావతి: ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, పుల్లంపేట మండలం అనంతసముద్రం-పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య కొత్తగా నిర్మించిన రోడ్డును వైసీపీ నేత ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ధ్వంసమైన రోడ్డుకు అయిన ఖర్చును వారి నుంచే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల క్రితమే రూ.4.75 కోట్ల వ్యయంతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అయితే, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి సహాయంతో ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని సుమారు 100 మీటర్ల మేర ధ్వంసం చేశారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో అధికారులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సోమవారం ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి, నిందితులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి ఆ మొత్తాన్ని వారి నుంచే రాబట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడిన వ్యక్తులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నిందితులను ఈరోజు సాయంత్రంలోగా అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని అధికారులు ఉప డిప్యూటీ సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.

గందరగోళాన్ని ఎన్నికల సంఘమే పరిష్కరించాలి : కాంగ్రెస్

మొదటి పేజి తరువాయి

నకిలీ కేటగిరీల కింద తప్పుగా తొలగించారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఒక మీడియా నివేదికను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ క్రమంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతున్న తీరు, కేంద్రం, ఎన్నికల సంఘం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "దిల్లీలో ఈ వినాశకరమైన ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జరిగిన ఓట్ల తొలగింపులలో అత్యధిక శాతం ఏఎస్ఎస్డీ కేటగిరీల కిందనే జరిగాయి. అంటే గైర్హాజరు, బదిలీ, మరణం, నకిలీ ఓట్లు అన్నమాట. బీజేపీ, దాని అనధికార ప్రతినిధులు దీనిని ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడం అని చెప్పుకుంటూ ఎస్ఐఆర్‌ను సమర్థించుకుంటున్నారు. కానీ దిల్లీలోని పౌర సమాజ సంస్థలు నిర్వహించిన ఒక పబ్లిక్ ఆడిట్ ఘూరణ పేరుతో విస్తృతంగా జరుగుతున్న తప్పుడు తొలగింపులను బట్టబయలు చేసింది. కేవలం 2 పోలింగ్ బూత్‌లలోనే ఘూరణ కింద తప్పుగా తొలగించిన కనీసం 100 మంది ఓటర్లను వారు కనుగొన్నారు. వీరిలో అత్యధికులు బదిలీ లేదా గైర్హాజరు కేటగిరీలకు చెందినవారే. దేశవ్యాప్తంగా కేవలం ఈ రెండు కేటగిరీలలోనే 9 కోట్లకు పైగా ఓటర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించారు. వీరిలో ఎంతమంది నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారో?"

జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

'ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే ఆపేయాలి'

ఎస్ఐఆర్ సమయంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఇంటింటి పర్యటనల వాస్తవాలను ఇటువంటి అవకతవకలు బయటపెట్టాయని జైరాం రమేశ్ ఆరోపించారు. అక్రమంగా తొలిగించిన ఓటర్లను మళ్లీ ఓటర్ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. " కేంద్ర ఎన్నికల సంఘం నష్ట నివారణ చర్యల్లో భాగంగా తన వివిధ పత్రికా ప్రకటనలలో హామీ ఇచ్చిన ప్రత్యేక శిబిరాలు, బీఎల్ఓల ఇంటింటి సందర్శనల అసలు రూపాన్ని ఈ నివేదికలు బయటపెడుతున్నాయి. ఓటు కోల్పోయిన చాలా మందికి ఈ శిబిరాల గురించి తెలియదు. అలాగే వారిని బూత్ స్థాయి అధికారులు కూడా సంప్రదించలేదు. తమ వినాశకరమైన ఎస్ఐఆర్ వల్ల ఏర్పడిన గందరగోళాన్ని పౌర సమాజం కాకుండా, స్వయంగా ఎన్నికల సంఘమే పరిష్కరించాలి. చట్టవిరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి. అక్రమంగా తొలగించిన ఓటర్లందరినీ తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలి. " అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

దేశాన్ని కుదిపేస్తోన్న ఎస్ఐఆర్, ఓట్ చోరీ అంశం

కాగా, ఓట్ చోరీ అంశం, ఎస్ఐఆర్ ప్రక్రియ యావత్ దేశాన్ని కుదిపేస్తోంది. ఎస్ఐఆర్‌లో అక్రమాలకు పాల్పడినందుకుగానూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సహా విపక్షాలు, కాక్రోచ్ జనతా పార్టీ గత కొద్ది రోజులుగా గళమెత్తుతున్నాయి. దేశ రాజధాని దిల్లీలో నిరసనలు చేపట్టాయి. ఆదివారం నాడు గోవాలో జరిగిన ర్యాలీలో ఓట్ చోరీ, ఎస్ఐఆర్ ప్రక్రియపై లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర సర్కార్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల చోరీ ప్రణాళికను రూపొందించింది ప్రధాని మోదీ అని, తెరవెనుక ఆయన రచించిన ప్రణాళికను అమిత్ షా కార్యరూపంలోకి తీసుకొచ్చారని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ అమలు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ఈ ముగ్గురూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారని అన్నారు. ఓట్ల చోరీకి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారని ధ్వజమెత్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదన్నారు.

50 డిగ్రీలకు చేరనున్న ఎండలు? గోదావరి నీటి నిల్వపై మంత్రి తుమ్మల కీలక ప్రకటన

మొదటి పేజి తరువాయి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలిపారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా గోదావరి నీటిని నిల్వ చేసే చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమ్మగారిపల్లి వద్ద గోదావరి ఆనకట్టను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇవాళ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరి నీటిని నిల్వ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని చెప్పారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. వర్షాలు తగ్గి భూగర్భజలాలు పడిపోయే పరిస్థితి ఏర్పడితే వ్యవసాయంతో పాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. నీటి లభ్యత తగ్గితే విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని తుమ్మల సూచించారు. నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించినట్లు చెప్పారు. గోదావరి నీటిని నిల్వ చేసే ప్రయత్నాల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలు ఏర్పాటు చేసే పనులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి



ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ-ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

చెప్పాం.. చేస్తున్నాం..

2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కల్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ

ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్-జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్-జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

ఈ వారం దక్షిణాదిలో దంచికొట్టనున్న వర్షాలు- ఏపీ, తెలంగాణలో ఎలా ఉంటుందంటే?

మొదటి పేజి తరువాయి



ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాలలో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని చెప్పింది. దేశవ్యాప్తంగా ఉన్న వాతావరణ పరిస్థితులను ఐఎండీ సోమవారం అంచనా వేసింది.

బిళ్లీ పరిసర రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితులు

వాయువ్య, మధ్య, తూర్పు, ఈశాన్య, ఉత్తర భారతదేశంలో ఈ వారం మొత్తం పొడి, స్థిరమైన వాతావరణం ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. ఇది బహిరంగ పండగ కార్యక్రమాలకు అనువైన పరిస్థితులను అందిస్తుందని అభిప్రాయపడింది. హరియాణా, చండీగఢ్, దిల్లీలో పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని స్పష్టం చేసింది. తద్వారా బహిరంగ వేడుకలు, ఫుడ్ స్టాల్స్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం లేదని వెల్లడించింది. ఆయా ప్రాంతాల్లో ఎండ కారణంగా పగటిపూట ఉష్ణోగ్రతలు 31లీజ నుంచి 34లీజ మధ్య ఉంటాయని పేర్కొంది. అయితే సాయంత్రం సమయానికి వాతావరణం చల్లబడుతుందని వివరించింది. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఆహ్లాదకరమైన 18లీజ-20లీజ పరిధికి పడిపోతాయని చెప్పింది. దిల్లీలో వాయు నాణ్యత సూచీ 135గా ఉందని, ఛాఫ్లా (210), చాందినీ చౌక్ (209), ఆర్కే పురం (207) వంటి రద్దీగా ఉండే ప్రాంతాలు పేలవమైన (ఆరెంజ్) కేటగిరిలోకి పడిపోయాయని వెల్లడించింది.

ఐఎండీ అంచనా ప్రకారం

ఉత్తరాదిన ఉన్న పొడి వాతావరణ పరిస్థితులకు భిన్నంగా దక్షిణాదిలో వర్షాలు దంచికొట్టనున్నాయి. అక్టోబర్ 24 వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, కేరళ, దక్షిణ కర్ణాటక ప్రాంతాలలో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు

సంగారెడ్డిలో జగ్గారెడ్డి, నిర్మల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- ఆరు వేదికలపై ఆటపాటలు.. విద్యుద్దీపాలతో కాంతులీనిన కింది బజార్ చెరువు కట్ట

- అలరించిన కళాకారుల ఆటపాటలు, ప్రత్యేక ఆకర్షణ గా నిలిచిన ఫోక్ సింగర్ కనకవ్వ పాటలు

- బతుకమ్మ ఆడి సందడి చేసిన జయా రెడ్డి , నిర్మలా జగ్గారెడ్డి, కుటుంబ సభ్యులు

- ప్రత్యేక ఆకర్షణ గా నిలిచిన ఎనిమిది టన్నుల పూలతో 32 అడుగుల మహా బతుకమ్మ

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 19: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

రంగురంగుల పూల సోయగాలు.. బతుకమ్మ పాటలు.. మహిళల ఆటపాటల కోలాహలం నడుమ సంగారెడ్డి పట్టణంలోని కింది బజార్ పెద్ద చెరువు కట్టపై బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూలతో పేర్చిన బతుకమ్మలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుద్దీపాల అలంకరణలతో చెరువు కట్ట పండుగ శోభను సంతరించుకుంది.ఎనిమిది టన్నుల పూలతో రూపొందించిన 32 అడుగుల మహా బతుకమ్మ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. 16 టన్నుల ఉక్కుతో నిర్మాణాన్ని సిద్ధం చేసి, వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. భారీ బతుకమ్మను చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలతో తరలివచ్చిన మహిళలు పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.మహిళలు బతుకమ్మ ఆడుకునేందుకు చెరువు కట్ట పొడవునా ఆరు ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. ఆయా వేదికల వద్ద కళాకారుల ఆటపాటలు, జానపద గీతాలు అలరించాయి. ప్రత్యేక ట్రస్ లైటింగ్‌తో వేదికలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భారీ తెరలు, ఫ్లడ్‌లైట్ టవర్లు, విద్యుద్దీపాల వెలుగులతో చెరువు కట్ట పరిసరాలు కాంతులీనాయి. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని గత పది రోజులుగా పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాల అలంకరణలు పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చాయి.సాయంత్రం ఐదు గంటల నుంచే చెరువు కట్ట వద్దకు చేరుకున్న జగ్గారెడ్డి వేడుకల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అనంతరం సంబురాల్లో పాల్గొని మహిళల్లో ఉత్సాహాన్ని నింపారు. నిర్మల జగ్గారెడ్డి తన కుమార్తె జయారెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలకు హాజరయ్యారు. మహిళలతో కలిసి నిర్మల జగ్గారెడ్డి, జయారెడ్డి బతుకమ్మ ఆడుతూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిన ఈ వేడుకల్లో



పూల బతుకమ్మలు, మహిళల ఆటపాటలు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, కూన సంతోష్,కిరణ్‌గౌడ్, మహేష్ ముదిరాజ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిన్నారి పాటకు మహిళల బతుకమ్మ ఆట.. చూపరులను ఆకట్టుకున్న శ్రీకరి



(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 18
: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

ఆదర్శనగర్ కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం వద్ద దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా రెండో తరగతి చదువుతున్న చిన్నారి శ్రీకరి అనర్గళంగా బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలను ఆడించింది. చిన్నారి పాటలకు మహిళలు ఉత్సాహంగా ఆటలాడటం అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది. చిన్న వయసులోనే అద్భుతంగా పాటలు పాడుతూ అందరినీ అలరించిన శ్రీకరిని అక్కడున్నవారంతా అభినందించారు.

మల్లాపూర్‌లో ఘనంగా శ్రీ శ్రీ శారదీయ దుర్గోత్సవం 2026

దుర్గోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 19 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్):

మల్లాపూర్ బంగీయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ శారదీయ దుర్గోత్సవం 2026, మూడవ సంవత్సరం గ్రాండ్ పూజా కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ ఆ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలని, ఉప్పల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని కోరారు మల్లాపూర్‌లోని వి.ఎన్.ఆర్. గార్డెన్ హాల్ 1లో నిర్వహించిన ఈ దుర్గోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఈ కార్యక్రమంలో బంగీయ సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు.

దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

- చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ, అక్టోబర్ 19 ప్రజా న్యూస్ అక్టోబర్ 19.

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆనందాలు నింపాలని, నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

విజయదశమి ధర్మం, న్యాయం, సత్యం సాధించిన విజయానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని చాటిచెప్పే ఈ పర్వదినం సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని కోరుకున్నారు.

యువత బాధ్యతగా వ్యవహరించాలి.. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

దసరా పండుగను యువత ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, అయితే వేడుకల సమయంలో అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే బాలునాయక్ సూచించారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పండుగ సంబరాలు కుటుంబాల్లో విషాదాన్ని నింపకూడదని, క్షణికమైన నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలిగొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.మీ కోసం మీ కుటుంబం ఎదురుచూస్తుంటుంది.. సురక్షితంగా ఇంటికి చేరడం కంటే గొప్ప పండుగ మరొకటి లేదు"అని అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. మద్యం సేవించిన వారు వాహనం నడపకుండా ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలను వినియోగించుకోవాలని, స్నేహితులు, కుటుంబ



సభ్యులు కూడా ప్రమాదకరమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించవద్దని సూచించారు.

ప్రజలందరి జీవితాల్లో విజయాలు చేకూరాలి

ఈ విజయదశమి దేవరకొండ నియోజకవర్గ ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, రైతులకు మంచి పంటలు పండాలని, యువతకు ఉజ్వల భవిష్యత్తు లభించాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ తమ కుటుంబాలతో ఆనందంగా గడపాలని కోరుతూ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

అలై బలై వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం

లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిసిన బండారు

దత్తాత్రేయ నేతృత్వంలోని ప్రతినిధి బృందం

హైదరాబాద్, అక్టోబర్ 19 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్) :

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నేతృత్వంలోని అలై బలై ప్రతినిధి బృందం సోమవారం లోక్‌భవన్‌లో కలిసింది. ఈ నెల 22న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న అలై బలై వేడుకలకు గవర్నర్‌ను ఆహ్వానించింది.గవర్నర్‌ను కలిసిన దౌత్యాధికారులు . ఈజిప్టులోని కైరోలో భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) సి. సుష్మ, కువైట్‌లోని భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) సంజయ్ కుమార్ ములుకా కూడా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

దుర్గాభవాని అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

- జై భవానీ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు..

- ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించిన ఎమ్మెల్యే

సంగారెడ్డి మండలం అక్టోబర్ 19: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో జై భవానీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాభవాని అమ్మవారిని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు తొలగిపోవాలని, కరువు కాటకాలు రాకుండా, విద్యుత్, తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రజలంతా ప్రశాంతమైన జీవితం గడపాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజల కష్టాలు తొలగిపోయి, గ్రామాలు సుభిక్షంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోబుచ్చిరెడ్డి, మధుసూదన్ రెడ్డి,మోహన్ రెడ్డి, కృష్ణ గౌడ్ , శంకర్ గౌడ్, ఆనంద్ రావు, రవికుమార్, నందకిషోర్,



వీరేశం, జంగయ్య, గౌస్, నవాజు,మురళి, భవానీ యూత్ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీశ్రీశ్రీ విజయ దుర్గా మల్లేశ్వర ఆలయంలో విద్యారణ్య సదనం భోజనశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 19 : (ప్రజా న్యూస్ నెట్‌వర్క్)

కాప్రాలోని జై జవాన్ కాలనీలో ఉన్న శ్రీశ్రీశ్రీ విజయ దుర్గా మల్లేశ్వర ఆలయంలో శ్రీశ్రీశ్రీ విద్యారణ్య సదనం భోజనశాల ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర ఆశ్వయుజ దుర్గాష్టమి సందర్భంగా అక్టోబర్ 18, 2026న అభిజిత్ లగ్నంలోని సుముహూర్తంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానానికి చెందిన శ్రీ విద్యారణ్య భారతి స్వామీజీ వారి కరకమలములచే శ్రీశ్రీశ్రీ విద్యారణ్య సదనం భోజనశాల ప్రారంభించబడింది. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, స్వామీజీ వారి ఆశీస్సులు భక్తులకు లభించాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ, సేవా కార్యక్రమాలకు ఉపయోగపడేలా భోజనశాల ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేపలమాదవరంలో వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- ఆటపాటలు, నృత్యాలతో సందడిగా వేడుకలు.. విజేతలకు ఫ్రిజ్‌లు బహూకరణ

- హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

మేళ్లచెరువు మండలం,అక్టోబర్ 19, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, మండలం రిపోర్టర్ రాజేష్ :

వేపలమాదవరం గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు బతుకమ్మ పాటలకు ఆటలు, నృత్యాలతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. హనుమాన్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో పాల్గొని విజయం సాధించిన వారికి ఫ్రిజ్‌లను బహుమతులుగా అందజేశారు. అమ్మవారి విగ్రహాన్ని భూసిపల్లి వీరరెడ్డి, అజిత్ రెడ్డి దానం చేయగా, గ్రామ ప్రజల సహకారంతో వేడుకలను నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు, యువత ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో హనుమాన్ యూత్ సభ్యులు యల్లావుల వినోద్, భూసిపల్లి వెంకటరెడ్డి, బోగాల మల్లారెడ్డి, బద్రిశెట్టి పుల్లారావు, బద్రిశెట్టి నరసింహారావు, కోట



వేణు, తుక్కిశెట్టి నవీన్ కుమార్, సూరే నవీన్, మద్దోజ్ కార్తీక్ చారి తదితరులు పాల్గొన్నారు.

దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకున్న ధోటి భూషయ్య

జై భవాని యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు




గుర్రంపోడు (శీష్ -19 ప్రజా న్యూస్)
చామలేడు గ్రామంలో దుర్గా మాతా సన్నిధిలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అర్చకులు కొప్పోజు నాగరాజు చేస్తున్న సేవలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. 9 రోజులుగా అమ్మవారికి రోజుకో అవతారంలో ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, కుంకుమార్చన పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా 9వ రోజు మహిషాసుర మర్దిని అవతారంలో అమ్మవారి అలంకరణకు అయ్యగారు చేసిన ప్రత్యేక పూజలు విశేషంగా నిలిచాయి. మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు అమ్మవారి చరిత్రను, ప్రతి అవతారం విశిష్టతను తెలియజేస్తూ భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారని దోటి భూషయ్య, జై భవాని యూత్ సభ్యులు, గ్రామస్తులు కొనియాడారు.

సీపీఐ పార్టీ కార్యాలయ స్థలాన్ని కాపాడాలి

- ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి : ఎం.ఏ. రెహమాన్





(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 19 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
సంగారెడ్డి పట్టణంలోని నారాయణరెడ్డి కాలనీ, మార్క్ నగర్‌లో మంజీరా టవర్స్ పక్కన, మోర్ సూపర్ మార్కెట్ వెనుక ఉన్న సీపీఐ పార్టీ కార్యాలయ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడి తిరిగి తమకు అప్పగించాలని సీపీఐ సంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఎం.ఏ. రెహమాన్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. 1985 ప్రాంతంలో కామ్రేడ్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీపీఐ పార్టీ భూపోరాటం చేసి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు సాధించిందని తెలిపారు. అదే సమయంలో పార్టీ కార్యాలయం కోసం సుమారు 250 గజాల స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. గతంలో రెండు గదులతో ఉన్న కార్యాలయం, పట్టణ కార్యదర్శి కామ్రేడ్ వాజీర్ బేగ్ మరణం అనంతరం నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు కార్యాలయాన్ని కూల్చివేసి, ఆ స్థలంలో టిఫిన్ సెంటర్ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు వెంటనే విచారణ జరిపి స్థలాన్ని పరిరక్షించాలని, ఆక్రమణకు ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై అక్టోబర్ 12, 2026న జిల్లా అధికారులకు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు, గ్రీవెన్స్ ఐడీ ఇూూచీ+12102600052 అని ఎం.ఏ. రెహమాన్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంగారెడ్డి మండల తహసీల్దార్ కూడా ఈ సమస్యపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలలో పాల్గొన్నా

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్. అక్టోబర్ .19 ప్రజా న్యూస్ నెట్వర్క్.
మన ప్రియతమ నాయకులు, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి వారిని శాలువాతో సత్కరించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు,ఎస్సీ ఎస్టీ ఎన్ఎస్యుఐ ఐఎన్టియుసి, విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేపల సింగారంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ..

ఇద్దరికి తీవ్ర గాయాలు

- రాళ్లు, కత్తులతో దాడి జరిగినట్లు ఫిర్యాదు.. హైదరాబాద్‌కు క్షతగాత్రుల తరలింపు

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ చలికంటి నరేష్



సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 19, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
హుజూర్‌నగర్ మండలం వేపల సింగారం గ్రామంలో బతుకమ్మ పండుగ అనంతరం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం, అక్టోబర్ 19న తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ధరావత్ మహేష్ తన స్నేహితులతో వెళ్తుండగా, వారితో ఉన్న సమీర్‌ను చూసి అతని తండ్రి నాగుల్ మీరా మందలించడంతో వివాదం మొదలైంది. ఈ క్రమంలో మహేష్, నాగుల్ మీరా మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం నాగుల్ మీరా తన బంధువులతో కలిసి ధరావత్ కృష్ణ ఇంటికి వెళ్లగా, ఇరు వర్గాల మధ్య మరోసారి ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా రాళ్లు, కత్తులతో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో భార్గవాచారి, మధుసూదనాచారికి తీవ్ర రక్తగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదుదారుడు సురోజు శ్రీనివాస్ చారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ చలికంటి నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

హుజూర్‌నగర్ 19వ వార్డులో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎండీ అజీజ్ పాషా

- తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి బతుకమ్మ ప్రతీక : అజీజ్ పాషా



హుజూర్‌నగర్ పట్టణం, అక్టోబర్ 19, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
హుజూర్‌నగర్ పట్టణంలోని 19వ వార్డు గోదాం బజార్, శ్రీనగర్ కాలనీల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ మాజీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, 19వ వార్డు ఇన్‌చార్జి ఎండీ అజీజ్ పాషా హాజరై మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని, పూలను పూజిస్తూ మహిళలంతా ఐక్యంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ పండుగలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మహిళలకు నాణ్యమైన బతుకమ్మ చీరలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలంతా పండుగలను ఐకమత్యంతో జరుపుకుంటూ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. మహిళలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో బత్తిని ఈశ్వరి, ఎల్లపుల ఉమా, శైలజ, లక్ష్మి, లింగమ్మ, గీత, అనసూయ, మౌనిక, చక్రాల స్వాతి, పైదమ్మ, అహల్య, చక్రాల లక్ష్మి, సీత, పద్మ, సింగం ధనలక్ష్మి, పూజిత, చెర్రీ, నాగ, హారిక, నాగమణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ..

- రూ.174.325 కోట్ల నిధులు మంజూరు

- కోదాడ, హుజూర్‌నగర్‌లో 54 రహదారి పనులకు ప్రభుత్వ అనుమతులు

- ఉత్తమ్ కుమార్ రెడ్డి, పద్మావతి రెడ్డి కృషితో పల్లెలకు కొత్త రహదారులు



సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 19, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:
సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో గ్రామీణ రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.174.325 కోట్ల నిధులు మంజూరు చేసింది. మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి ప్రత్యేక చొరవతో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సీఆర్ఆర్ పథకం కింద ఈ నిధులు కేటాయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ జీవోలు 558, 559 జారీ చేశారు. మొత్తం 13 మండలాల్లో 54 పనుల ద్వారా 156.95 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించేందుకు పరిపాలనా అనుమతులు లభించాయి. కోదాడ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తొమ్మిది రహదారి పనులకు రూ.30 కోట్లు కేటాయించగా, 25.40 కిలోమీటర్ల మేర రహదారులు అభివృద్ధి చేయనున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 45 రహదారి పనులకు రూ.144.325 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనుల ద్వారా 131.55 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించనున్నారు. మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు ప్రధాన రహదారులతో అనుసంధానం ఏర్పడనుంది. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంతో పాటు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడానికి, అత్యవసర వైద్య సేవలు పొందేందుకు రహదారులు ఉపయోగపడనున్నాయి. పనులు పూర్తయితే గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజల ప్రయాణ కష్టాలు తగ్గనున్నాయి. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల గ్రామీణ అభివృద్ధికి ఈ నిధులు తోడ్పడనున్నాయి.

రేవూరు గ్రామంలో ఆడపడుచులకు బతుకమ్మ గిఫ్ట్‌లు పంపిణీ

- బతుకమ్మ సంబరాల్లో మహిళలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్న పిల్లుట్ల రఘు

- ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా: పిల్లుట్ల రఘు



మేళ్లచెరువు మండలం, అక్టోబర్ 19, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:

మేళ్లచెరువు మండలం రేవూరు గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు ఆడపడుచులకు బతుకమ్మ గిఫ్ట్‌లను పంపిణీ చేశారు. గ్రామానికి చేరుకున్న రఘుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం మహిళలు, ఆడపడుచులతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఉత్సాహంగా నృత్యం చేస్తూ సంబరాల్లో భాగమయ్యారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ రేవూరు గ్రామంలో గతంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించానని, దేవాలయాలకు తనవంతు సహాయం అందించడంతో పాటు నిరుపేదలకు అండగా నిలిచానని తెలిపారు. రాబోయే రోజుల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజలు తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రేవూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు, ఆడపడుచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా న్యూస్ నెట్‌వర్క్
నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||

సాయి సన్నిధిలో శరన్నవరాత్రి మహోత్సవం.

- శ్రీ సాయినాధుని 108వ పుణ్యతిది కార్యక్రమం. భక్తులందరికీ విజయదశమి శుభాకాంక్షలు.

- సాయి సన్నిధి ఆలయ అధ్యక్షులు ధనుంజయ.

దేవరకొండ చింతపల్లి అక్టోబర్ 19 ప్రజా న్యూస్.

దేవరకొండ నియోజకవర్గం లోని చింతపల్లి మండలంలో దివ్యమైన, ప్రసిద్ధిగాంచిన సాయి సన్నిధి దేవాలయంలో శరన్నవరాత్రుల కార్యక్రమాలను జరుపుతున్నారు. శ్రీ సాయినాధుని 108వ పుణ్యతిది (సమాధి) ఈ విజయదశమితో 108 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు ఆలయ అధ్యక్షులు ధనుంజయ, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, కోశాధికారి కృష్ణయ్య తెలిపారు. కావున మంగళవారం విజయదశమి పండుగ రోజున సాయిబాబా సన్నిధి మహోత్సవ కార్యక్రమం జరుపబడుతుంది స్వామి కరుణ,దయ,కృపా కటాక్షం ప్రతిభక్తులపై ఉండాలని స్వామివారి మహోత్సవానికి భక్తులందరూ తరలి రావాలని వారు తెలిపారు. భక్తులకు మోక్షం ప్రసాదించుటకు సాయి స్వామి వారు భిక్షాటన చేసి అనేకుల అరిష్టములు కష్టనష్టములను తొలగించి తనను నమ్మినవారికి లేమి లేకుండా చేసి ఎన్నో దివ్యాలీలను ప్రదర్శించారు అట్టి మహోన్నతమైన స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని, పాడి పంటలు సుఖశాంతులతో సాయి బంధువులు ఉండాలని ఈ విజయదశమి సందర్భంగా ఆలయ అధ్యక్షులు ధనుంజయ తెలిపారు. అలాగే మహా సహస్రావధాని ప్రవచన పరబ్రహ్మ సోషల్ మీడియాలో ఏ విషయాన్ని అయినా అనర్ఘంగా మాట్లాడగలిగే సత్తా,ధైర్యం మరియు ఉన్నది ఉన్నట్లుగా ముక్కు సూటిగా మాట్లాడగలిగే మహానుభావుడు అని పిలవబడే పద్మశ్రీ,శ్రీ గరికపాటి నరసింహారావు గారి ప్రవచనాలు 22 -10- 2026



గురువారం రోజున 11 గంటలకు మన చింతపల్లి సాయి సన్నిధిలో యోగ సమాధి గురించి సుదీర్ఘ ప్రవచనాన్ని వారి మాటల్లో భక్తులందరూ విని మేధో సంపత్తిని పొందాలని వారు కోరారు కావున భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనిస్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ ద్వారా భక్తులకు తెలియజేశారు.

ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌లో వెలగని వీధి దీపాలు

- చీకటిమయంగా ప్రధాన రహదారి.. ప్రమాదాలకు నిలయంగా మారిన బ్లాక్‌స్పాట్

- ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి : కాలనీవాసులు

నాగార్జునసాగర్ (నందికొండ), అక్టోబర్ 19, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ కిరణ్ కుమార్:

ప్రపంచ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని నెహ్రూ పార్క్ వై జంక్షన్ సర్కిల్ నుంచి విజయ విహార్ కాన్వెంట్ టీ సర్కిల్ వరకు వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో రహదారి చీకటిమయంగా మారడంతో మహిళలు, హాస్టల్ విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. వీధి కుక్కలు, కోతులు, విషపురుగుల సంచారం కూడా ఆందోళన కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో గతంలో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల్లో ఇరిగేషన్ ఉద్యోగి రెండు కాళ్లు విరగడం, పర్యాటక శాఖ ఉద్యోగి చేయి విరగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. ఒక ఉపాధ్యాయుడు, ఒక విలేకరి మృతి చెందినట్లు పేర్కొన్నారు. చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తున్న జాలరి స్కూటీని కారు ఢీకొట్టిన ఘటన కూడా జరిగిందని గుర్తుచేశారు. ఏళ్ల తరబడి ఇదే ప్రాంతంలో వీధి దీపాలు వెలగకపోవడంతో పండుగల సమయంలో స్వగ్రామాలకు వచ్చేవారు, దేవాలయాలకు వెళ్లే మహిళలు, పిల్లలు సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ల సాయంతో ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఇబ్బందులు ఎదురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత



ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గడ్డిపల్లి నడిబొడ్డున భారీ గుంత..

అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం!

- ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉన్నా పట్టించుకునే వారేరీ?

- ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన గుంత.. ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా?

- గరిడేపల్లి మండలంలో రహదారి దుస్థితిపై ప్రజల ఆగ్రహం.. తక్షణ మరమ్మతులకు డిమాండ్!

గరిడేపల్లి మండలం, అక్టోబర్ 19, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్:

సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామ నడిబొడ్డున ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంత వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రహదారిపై గుంత ఏర్పడి వర్షపు నీరు నిలుస్తున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేరేడుచర్ల నుంచి సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ వందలాది వాహనాలు, భారీ లారీలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. అలాంటి కీలకమైన రహదారిపై భారీ గుంత ఏర్పడటం, అందులో వర్షపు నీరు నిలవడం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గుంత లోతు కనిపించక ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనాల డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో గుంతను గుర్తించడం కష్టంగా మారడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిత్యం ప్రజలు, ప్రయాణికులు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నప్పటికీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజలు ప్రమాదంలో పడిన తర్వాత స్పందిస్తారా? ముందుగానే మరమ్మతులు చేపట్టలేరా? అంటూ



స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రధాన రహదారిపై ఇంతటి సమస్య ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉన్నందున ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి గుంతను పూడ్చి, రహదారికి నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక చర్యలతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గడ్డిపల్లి ప్రధాన రహదారి సమస్యను పరిష్కరిస్తారా? లేక ప్రజల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

సీఎం రేవంత్‌కు బండ్ల గణేశ్ విజ్ఞప్తి



పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఈరోజు ఆయన ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఒక ప్రకటన చేశారు.పౌల్ట్రీ పరిశ్రమకు కీలకమైన మొక్కజొన్న, సోయాబీన్, డీఓసీ వంటి ముడిసరుకులను కొందరు స్టాకిస్టులు అక్రమంగా గోదాముల్లో నిల్వ చేస్తున్నారని బండ్ల గణేశ్ ఆరోపించారు. దీనివల్ల మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి, ధరలను అమాంతం పెంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. "ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోవాలి. పౌల్ట్రీ రంగానికి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలి" అని ఆయన కోరారు.ఇప్పటికే అనేక ఆర్థిక, సాంకేతిక సమస్యలతో సతమతమవుతున్న పౌల్ట్రీ రైతులకు ఈ ధరల పెరుగుదల అదనపు భారంగా మారిందని బండ్ల గణేశ్ తెలిపారు. సంబంధిత అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, రైతులకు సరసమైన ధరలకు, సకాలంలో ముడిసరుకులు అందేలా చూడాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ పౌల్ట్రీ రైతుల తరఫున తాను ఈ విజ్ఞప్తి చేస్తున్నానని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు.

చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి

- తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు

- తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్.

(సూర్యాపేట జిల్లా అక్టోబర్ 19 ప్రజా న్యూస్ నెట్‌వర్క్)



చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి వేదికగా ప్రాచుర్యంలోకి వచ్చిందని తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు, పంతంగి వీరస్వామి గౌడ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తన రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చరిత్ర ఇతిహాసాలు పురాణాల ఆధారంగా చెడుపై మంచి సాధించినందుకు సంకేతం గానే ప్రజలు విజయదశమి వేడుకలు జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు నవరాత్రిఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేయడం గొప్ప విషయం అన్నారు. సమాజం లో దైవ అనుగ్రహంతోనే మానవజాతి మనుగడ ఉంటుందని పంతంగి వీరస్వామి గౌడ్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా విజయదశమి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. జమ్మి చెట్టు కొమ్మ పాలపిట్ట ల సాక్షిగా ప్రతి ఒక్క కుటుంబంలో ఆనందోత్సవాలు ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ విజయదశమి మరియు దీపావళి శుభాకాంక్షలు పంతంగి వీరస్వామి గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్ రాష్ట్ర కార్యదర్శి అమరవాది శ్రవణ్ కుమార్,జిల్లా గౌరవ సలహాదారుడు దేవత్ కిషన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి జిల్లా కోశాధికారి పాల సైదులు పట్టణ గౌరవ సలదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి పట్టణ రియల్ ఎస్టేట్ కార్యదర్శి అయితే గాని మల్లయ్య గౌడ్ సహాయ కార్యదర్శి ఆకుల మారయ్య గౌడ్, జిల్లా రియల్ ఎస్టేట్ ఉపాధ్యక్షుడు కోడి లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి ఖమ్మం పాటీ అంజయ్య గౌడ్ పట్టేటీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఏజెన్సీలో 50 నుంచి 60 శాతం స్థానాల్లో పోటీ చేస్తాం : నాగబాబు



జనసేన పార్టీ ఎమ్మెల్సీ, ఏపీ గ్రీన్ సొసైటీ చైర్మన్ కొణిదెల నాగబాబు రాబోయే ఎన్నికల సీట్లపై కీలక వ్యాఖ్యలు చేశారు. అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలోని దాదాపు 50 నుంచి 60 శాతం సీట్లలో జనసేన పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. అరకులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగబాబు, పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. జనసేన పార్టీకి అరకు ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని, మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కోట్లాది రూపాయలతో పవన్ పునాదులు వేశారని గుర్తుచేశారు. గిరిజనుల పురోగతికి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో, ఏజెన్సీ ప్రాంతంలోని సీట్లపై నాగబాబు చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ప్రకటనతో ఏజెన్సీలో సీట్ల పంపకాలపై జనసేన తన వైఖరిని పరోక్షంగా స్పష్టం చేసినట్లుగా భావిస్తున్నారు.

రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..

నష్టాన్ని వారి నుంచే వసూలు చేయండి : పవన్ కల్యాణ్



ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, పుల్లంపేట మండలం అనంతసముద్రం–పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య కొత్తగా నిర్మించిన రోడ్డును వైసీపీ నేత ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ధ్వంసమైన రోడ్డుకు అయిన ఖర్చును వారి నుంచే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల క్రితమే రూ.4.75 కోట్ల వ్యయంతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అయితే, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి సహాయంతో ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని సుమారు 100 మీటర్ల మేర ధ్వంసం చేశారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో అధికారులు ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.సోమవారం ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి, నిందితులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి ఆ మొత్తాన్ని వారి నుంచే రాబట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడిన వ్యక్తులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నిందితులను ఈరోజు సాయంత్రంలోగా అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని అధికారులు ఉప డిప్యూటీ సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.